www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 11 మే 2025
5
తిరుపతి

రేణిగుంట పాత విమానాశ్రయంలో..

రేణిగుంట విమానాశ్రయంలో... 'మాక్‌డ్రిల్'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఎయిర్ పోర్ట్‌లో ఏదైనా అనుకోని ఘటనలు జరిగే సమయంలో ఎయిర్ పోర్ట్ లో ప్రజలను ఎలా కాపాడుకోవాలో అనే దానిపై జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఎయిర్పోర్ట్ డైరెక్టర్ భూమి నాదన్, ఏ ఎస్ పి రవి మనోహర చారి పర్యవేక్షణలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. పాత విమానాశ్రయములో శనివారం 120 మంది సిబ్బందితో కలిసి అనుకోకుండా ఎయిర్ పోర్ట్ లో టెర్రరిస్టు వస్తే వారిని ఎలా ఎదుర్కోవాలో అనేదానిపై పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇద్దరు టెర్రరిస్టులు ఎయిర్ పోర్ట్ లోకి ప్రవేశించి విచ్చలవిడిగా కాల్పులు జరిపితే ఎలా ఉంటుందో కళ్ళకు కట్టినట్లు మాక్ డ్రిల్ లో సిబ్బంది చూపించారు. ఒక్కరిగా ఎయిర్ పోర్ట్ లోకి ప్రవేశించి కాల్పులు జరిపారు. అయితే ఎం జరుగుతుందో అర్థకాని పరిస్థితిలో పబ్లిక్, ఎవరు వచ్చారో గందరగోళం పరిస్థితి లో ఎయిర్ పోర్ట్ సిబ్బంది ఉన్నారు. వెంటనే ఎయిర్ పోర్ట్ లో సిఆర్పీఎఫ్ బలగాలు, సిసి కెమెరాలు ద్వారా ఎంత మంది టెర్రరిస్టులు వచ్చారు, అనేదాని పై అవగాహనకు వచ్చిన తరువాత ఆపరేషన్ మొదలు పెట్టారు. టెర్రరిస్టులను సీఆర్పీఎఫ్ బలగాలు ప్రణాళిక బద్ధంగా అంతం చేసిన విధానాన్ని ఎయిర్ పోర్ట్ లో ప్రజలకు కళ్ళకు కట్టినట్లు అధికారులు చూపించారు. ఒకవేళ టెర్రరిస్టులు ఎయిర్ పోర్ట్ లోకి ప్రవేశిస్తే.. అంతం చేస్తామని దీటుగా సీఆర్పీఎఫ్ బలగాలు మాక్ డ్రిల్ చేసి చూపించారు. ప్రజల రక్షణ కోసం సీఆర్పీఎఫ్ బలగాలకు మేము తోడుగా అంటూ పోలీస్ సిబ్బంది తోపాటు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తో ఎయిర్ పోర్ట్ అంతా జల్లిడ పట్టారు. అనుమానిత బ్యాగులను పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా అనుమానంగా కనిపిస్తే... వెంటనే అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పిలు శిరీష, కే.బహదూర్, రవీంద్రనాథ్ రెడ్డి, చంద్రశేఖర్, సిఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాజేంద్రప్రసాద్, సిఎస్ఓ శ్రీనివాసరావు, సీఐలు శ్రీకాంత్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, ఎస్ ఐ బాబా పాల్గొన్నారు.

ఎస్పీలతో డిజిపి వీడియో కాన్ఫరెన్స్

రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా దేశ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలపై రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో ఎస్పిలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతి కమాండ్ కంట్రోల్ రూమ్ ఉండి జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జిల్లా అధికారులు వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా పరిస్థితులను డీజీపీకి వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న శాంతి భద్రతల విషయంతో పాటు వివిధ పరిణామాలపై డిజిపి హరిష్ కుమార్ గుప్తా ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఏఎస్పీలు జె. వెంకట్రావు, శ్రీనివాసరావు, సిఐలు సాదిక్ ఆలీ, సుబ్రహ్మణ్యం, ఆర్ ఐలు రాజశేఖర్ రెడ్డి, రమణారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

జిల్లాలో డ్రోన్ కెమెరాలపై ఆంక్షలు

జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో తిరుపతి జిల్లా భద్రతా పరంగా సున్నితమైన ప్రాంతం కావడంతో జిల్లా వ్యాప్తంగా డ్రోన్ కెమెరాల అనధికార వినియోగంపై పోలీసులు ఆంక్షలు విధించారు. తిరుపతి దేశంలో ఒక ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం. దేశ నలుమూలల నుండి దర్శనార్థం వచ్చే భక్తులు, తిరుమల శ్రీవారి దేవస్థానం, విమానాశ్రయం తో భద్రతా దృష్ట్యా సున్నితమైన ప్రాంతంగా గుర్తించారు. తిరుపతి, పరిసర ప్రాంతాల్లో ఇటీవలి కాలంలో డిజిసిఏ విధించిన నిబంధనలు ఉల్లంఘిస్తూ అనధికారికంగా డ్రోన్ వినియోగం జరుగుతోంది. ఇది ప్రజల శాంతి భద్రతలకు ప్రమాదకరంగా పోలీసులు గుర్తించారు. ఎస్పీ ఆదేశాలతో డ్రోన్లకు ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో డ్రోన్ కెమెరాలను ఎగురవేయాలంటే తప్పనిసరిగా డిజిసిఏ నుంచి లైసెన్స్‌లు పొందాలని సూచించారు. నిర్దిష్ట జోన్లలో డ్రోన్లుఎగరకూడదని సూచించారు.

- పదివేల మంది కార్మికులకు పనులు కరువు
- 'సైదాపురం మైన్స్' పరిధిలో ఉపాధి 'వ్యథ'
- 'లీజు' అనుమతుల్లో ప్రజాప్రతినిధి 'కీ'రోల్

'మైన్స్' రెన్యువల్ రాజ'కీ'యం

మే 20న దేశవ్యాప్త సమ్మె

ప్రజాశక్తి - వెంకటగిరి రూరల్

సైదాపురం తెల్లరాయి మైన్స్‌కు ప్రపంచంలోనే మంచి గుర్తింపు ఉంది. మండలంలో దాదాపు వంద తెల్లరాయి మైన్స్ ఉన్నాయి. గూడూరు, పొదలకూరు మండలాల పరిధిలో మరో 70 మైన్స్ ఉన్నాయి. వీటిలో 130 మైన్స్‌కు అన్ని అనుమతులు ఉన్నట్లు సమాచారం. 40 మైన్స్‌కు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నడుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మైకా, పల్స్‌పర్, క్వార్ట్జ్, వర్క్‌వైట్ తీస్తారు. లీజు రెన్యువల్ చేయాల్సి ఉండగా ఒప్పందాలు సరిగ్గా లేకపోవడంతో 130 మైన్స్‌లో పనులు నిలిచిపోయాయని తెలుస్తోంది. తొమ్మిది నెలలుగా మంత్రి కొల్లు రవీంద్ర, నారా లోకేష్‌లతో పలుమార్లు మైన్స్ లీజుదారులు కలిసినా ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఇప్పటికి నాలుగుసార్లు లీజుదారులతో సమావేశమైనా సమస్య కొలిక్కి రాలేదు. ఓ ప్రజాప్రతినిధి కోసం, పదివేల మంది కార్మికుల పొట్టగొట్టారన్నది స్థానికుల ఆవేదన. రోజుకు కోట్లల్లో వ్యాపారం జరుగుతున్న నేపథ్యంలో మైనింగ్‌లో 'చక్రం' తిప్పుతూ, కార్మికుల పొట్ట గొడుతున్నారన్న ఆవేదన 'స్థానికుల్లో' ఉంది. మనుబోలు వద్ద త్వరలో ప్రారంభించన్న మైనింగ్ ఫ్యాక్టరీకే లీజుదారులంతా 'తెల్లరాయి' తాను చెప్పిన రేటుకు తరలించేందుకే పెద్దఎత్తున రాజకీయం నడుస్తున్నట్లు సమాచారం. ఇక్కడ మైనింగ్ అధికారులు ఓ రకంగా 'కీలు బొమ్మలే'.

10వేల మంది కార్మికుల ఇక్కట్లు

సైదాపురం మండలంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ ఎక్కువమంది మైన్స్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తారు. గూడూరు మండలంలోని వెడిచర్ల, తుంగపాలెం, చెమిర్తి, కందలి, మంగళపూరు, చెన్నూరు, నెల్లటూరు, గొల్లపల్లి,కొమ్మనేటూరు గ్రామాల నుంచి కార్మికులు పనులు చేస్తున్నారు. రాపూరు మండలం నుంచి పులిగిలిపాడు, బోధనపల్లి, నవాబుపేట, చానాయపాలెం, డ్యాంరోడ్డు, దుగ్గగుంట, గిలకపాడు గ్రామాల నుంచి పనులు చేస్తారు. పొదలకూరు మండలం నుంచి దేగపూడి, ముదిగేడు, కొత్త కంబాలపల్లి గ్రామాల నుంచి పనిచేస్తారు. రాయి బయటకు తీసే కార్మికులు, లారీ, టిప్పర్, జేసీబీ, ట్రాక్టర్, కార్లు తదితర డ్రైవర్లు, చిన్న చిన్న వ్యాపారులు, ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులందరికీ గత తొమ్మిది నెలలుగా పనులు లేక వీధినపడిన పరిస్థితి. కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వీరంతా దాదాపు పదివేల మందిపైనే ఉంటారని అంచనా. 2వేల మంది వలస కార్మికులు బీహార్, ఒరిస్సా, పశ్చిమబెంగాల్ తదితర ప్రాంతాల నుంచి ఉన్నారని సమాచారం. వీరు రోజంతా దాదాపు 10 గంటలు పనిచేస్తే గిట్టుబాటు అయ్యే కూలి కేవలం రూ.500 మాత్రమే. అయినా మండుటెండలోనూ సెగలు కక్కుతూ పనిచేసే వీరికి, ప్రస్తుతం పనులు లేక ఆకలి కేకలతో ఒక్కొక్కరు వలస బాట పడుతున్నారు.

పనులు కోల్పోవడానికి కారకులెవరు?

ఈ మైనింగ్ మాఫియాలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయనకు సంబంధించిన రెండు ఎక్స్‌పోర్ట్ కంపెనీలు మాత్రమే విదేశాలకు తెల్లరాయిని సరఫరా చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. లక్ష్మీ క్వార్ట్జ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డైరెక్టర్‌గా ఉన్నారు. మరో కంపెనీ కూడా మనుబోలులో త్వరలో ప్రారంభిస్తారని సమాచారం. తనకు మాత్రమే సరకు విక్రయించాలని మైన్స్ యజమానులను బెదిరించినట్లు తెలుస్తోంది. దీంతో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మైన్స్ యజమానులు కోర్టును ఆశ్రయించారు. ఇప్పటికీ వారికి న్యాయం జరగలేదు. అన్ని మైన్స్‌ను తన గుప్పెట్లో పెట్టుకుని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రాజకీయ పలుకుబడిని ఉపయోగించి, తమ వ్యాపారాలు జరగనీకుండా ఒత్తిడి చేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటూ ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా ఇప్పటివరకూ లీజుదారులకు న్యాయం జరగలేదు. ఇప్పటికి నాలుగుసార్లు లీజుదారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తమకే సరకు విక్రయించాలని డిమాండ్ చేశారని సమాచారం. దీంతో వారు ససేమిరా అనడంతో అనుమతులు ఇవ్వలేదని తెలుస్తోంది. ఈ రంగాన్ని నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న వారు చెట్టుకొకరు పుట్టుకొకరుగా మిగిలిపోయారు.

కేంద్ర ప్రభుత్వం చేతికి పెత్తనం

అధికార పార్టీలో ఉన్న ప్రజా ప్రతినిధి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రభావం కోసం మైనింగ్ పెత్తనం కేంద్ర ప్రభుత్వం చేతికి వెళ్ళింది. కావాలని ఉద్దేశపూర్వకంగా జరిగిందని ప్రజలు, కార్మికులు, కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి వరకు మైనర్ మినరల్స్ జాబితా కింద రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉన్న అనుమతులు, ఇప్పుడు మేజర్ మినరల్స్ కింద కేంద్ర ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లాయి. ఇకపై ఇండియా బ్యూరో ఆఫ్ మైన్స్ పరిధిలో అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇప్పటివరకు అమరావతి చుట్టూ తిరిగిన లీజుదారులు ఇప్పుడు ఢిల్లీకి తిరగాల్సి ఉంటుంది, అక్కడ ఎవరికి పలుకుబడి ఉంటే వారి చేతికి లీజ్ దక్కే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తుంది. ప్రస్తుతం 20 సంవత్సరాలు ఉన్న లీజు ఇకపై 50 సంవత్సరాలకు పొందే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సర్వే నిర్వహించి, ప్రత్యేక జోన్గా నిర్ణయించాకా అప్పుడు కేంద్రం అనుమతులిచ్చే అవకాశాలున్నాయి. ఇది ఎప్పటికి పూర్తి అవుతుందనే ఆందోళన అందరిలో ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం మైనింగ్‌లో వెంకటగిరి రాజాలే 'కింగ్'లు. అయితే రాజులు పోయారు, రాజరికం అంతరించిపోయింది. వెంకటగిరి ప్రాంతంలోరాజా కుటుంబం తన రాజ భవనాన్ని అద్దెలకు ఇచ్చింది. ఎప్పటినుంచో టిడిపిలో కొనసాగిన రాజాలు గత ఎన్నికల్లో వైసిపిలో చేరారు. ప్రస్తుతం టిడిపి అధికారంలోకి రాగానే కలిచేడు మైన్ లీజు దక్కించుకోడానికి ఆ కుటుంబం అనేక ప్రయత్నాలు చేస్తోంది.

పనులు లేక వలస వెళుతున్న కార్మికులు

ఎన్నో ఏళ్లుగా మైనింగ్లో కార్మికులుగా పనిచేస్తూ గత తొమ్మిది నెలలుగా మైనింగ్ నిలిచిపోయి, పనులు లేనందున ఇక్కడ ఏ పని దొరకకపోవడంతో నెల్లూరులో కొంతమంది అపార్ట్మెంట్లలో వాచ్మెన్ గాను, భవన నిర్మాణ కార్మికులు గాను ఉంటూ పనులు చేసుకుని జీవనం గడుపుతున్నారు. ప్రభుత్వం స్పందించి మైనింగ్లో ఉపాధి కల్పించినట్లైతే సొంత ఊర్లోనే జీవనం సాగించుతాము అని కార్మికులు అంటున్నారు. మైనింగ్ ఆధారంగానే ఎన్నో ఏళ్ల నుంచి జీవనం సాగిస్తున్న జెసిబి ఆపరేటర్స్ మైనింగ్ నిలిచిపోవడంతో బతుకు జీవనం చాలా కష్టంగా మారింది. ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకొని తమకు న్యాయం చేయాలని, పనులు కల్పించి ఆకలి తీర్చాలని వారంతా కోరుతున్నారు.

మా విద్యార్థులను దేశరక్షణకు తయారు చేస్తాం

'వెరిటాస్ సైనిక్ స్కూల్' ఛైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

గడిచిన 22 సంవత్సరాలుగా బిఎస్సార్ విద్యాసంస్థల నుండి సుమారుగా 20వేల మంది విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను బోధించామని, 6 వేలమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని, వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యాసంస్థల విద్యార్థులను దేశ రక్షణ కోసం తయారు చేస్తామని సైనిక్ స్కూల్ ఛైర్మన్ డాక్టర్ బి. శేషారెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్నేళ్లుగా అందరి సహకారంతో భారత రక్షణ దళానికి ఎంతోమంది సైనికులను అందించేలా కషి చేశామని, ఇప్పుడు ఉన్నత అధికారులుగా విద్యార్థులు ఎదగడానికి అవసరమైన ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వెరిటాస్ సైనిక్ స్కూల్ లో విద్యార్థులకు విద్యతోపాటుగా శారీరక, మానసిక, మానవీయ విలువలతో కూడిన విద్యను అందిస్తున్న నేపథ్యంలో 63 సంవత్సరాల చరిత్ర కలిగినటువంటి సైనిక్ స్కూల్ సొసైటీ, భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ నుండి సైనిక్ స్కూల్ అప్రూవల్ పొందామన్నారు. ఇంతటి ఘన గుర్తింపును అందుకోవడంతో మరింత బాధ్యతగా దేశ భద్రత కోసం వెరిటాస్ సైనిక్ స్కూల్ ముందడుగు వేస్తుందన్నారు. రాబోవు కాలంలో ప్రభుత్వ సైనిక్ స్కూలు అనుసంధానంతో కరికులం, యాక్టివిటీస్, కాంపిటీషన్స్ అన్ని సైనిక్ స్కూల్ సొసైటీ నిబంధనలకు అనుగుణంగా నిర్వహింపబడతాయన్నారు. మన రాష్ట్రంలోని ఇతర సైనిక్ స్కూల్స్ విద్యార్థులతో అన్ని కార్యక్రమాలలో వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొంటారని, అదేవిధంగా అడ్మిషన్లలో కూడా వివిధ రాష్ట్రాల నుండి ఇక్కడ విద్య కోసం వచ్చే వారితో కొత్త అనుభూతులు తెలుసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఇకపై ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షల ద్వారా కౌన్సిలింగ్ నిర్వహింపబడి సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. ఉత్తమమైన విద్యా బోధన ద్వారా డిఫెన్స్ రంగాలలో ఎన్డీఏ, టీఈఎస్ లాంటి ఉత్తమమైన ఉద్యోగ అవకాశాలను 17 ఏళ్ల వయసుకే అందుకునే అవకాశం ఉందన్నారు. వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు దేశం పట్ల గాని, సమాజం పట్ల గాని బాధ్యతాయుతంగా నడుచుకునేలా విలువలతో కూడిన విద్యను నేర్పబడుతుందన్నారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ మినిస్టర్ ఆఫ్ డిఫెన్స్ నుండి వెరిటాస్ సైనిక్ స్కూల్ కు పొందిన అప్రూవల్ దవపత్రాన్ని మీడియాకు చూపించారు. ఈ విలేకరుల సమావేశంలో వెరిటాస్ సైనిక్ స్కూల్ సంస్థ డైరెక్టర్లు బి.శ్రీకర్ రెడ్డి, బి.సందీప్ రెడ్డి, టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

దళితులు, గిరిజనులను రక్షించే ఏకైక చట్టం ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ నిరోధక చట్టాన్ని అమలు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తిరుమలలో ఎస్సీ ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచంద్రయ్యను కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, రాష్ట్ర అధ్యక్షులు ఓ .నల్లప్ప, కెవిపిఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు ఎం.డి శ్రీనివాసులు, నగర కార్యదర్శి ఎన్. రఘు కలిసి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో దళితుల భూములను ఆక్రమించుకుంటున్న పెత్తందారులపై పోలీసులు కేసులు నమోదు చేయడం లేదన్నారు. నిత్యం రాష్ట్రంలో దళిత గిరిజనులపై అగ్రవర్ణాలు దాడులు చేస్తున్నా రాజకీయ జోక్యంతో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. దాడి జరిగిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, 60 రోజుల్లోపు ఛార్జిషీట్ సమర్పించే విధంగా డిఎస్పిలకు తగిన ఆదేశాలు ఇవ్వాలని, స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అన్ని స్థాయిలలో ఏర్పాటుచేసి ప్రతి మూడు, ఆరు నెలలకు ఒకసారి జరిపి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో వి .ప్రభాకర్, టి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేడు మాతృమూర్తులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

సమాజంలో మాతృమూర్తులకు ఎంతో ఘనమైన విలువలు ఉన్నాయని, ఘనమైన సన్మానంతో సగౌరవం లభిస్తుందని మాతదేవోభవ సత్సంగ్ ఏపీ అధ్యక్షురాలు అమరావతి రెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో అదిలీల ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు ఆదినారాయణతో కలిసి ఆమె మాట్లాడారు. మే 11 అంతర్జాతీయ మాతృదినోత్సవ వేడుకలను పురస్కరించుకొని తిరుపతి నగర పరిధిలోని యూత్ హాస్టల్ వేదికగా అంతర్జాతీయ మాత దినోత్సవ వేడుకలు - 2025ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సమాజంలో పలు రంగాలలో సేవలు అందించిన వారిని సన్మానించనున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటలకు అమర సంస్కతిక సేవా సమితి బ్లైండ్ పిల్లలచే పాట కచేరి, ముఖ్య అతిథులచే మాతమూర్తులకు సన్మానం, బహుమతుల ప్రదానం చేస్తామన్నారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ప్రముఖ అంకాలజీ న్యూట్రీషియన్ డాక్టర్ స్వప్నప్రియ హాజరవుతారన్నారు.

గంగమ్మకు 'శ్రీవారి' సారె సమర్పించిన టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి శ్రీ తాతయ్యగుంట గంగమ్మకు శనివారం టిటిడి తరపున ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈవో జె.శ్యామలరావు సారె సమర్పించారు. ముందుగా సారెకు తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలోని శ్రీ పుండరీకవల్లి అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కళాబందాల ప్రదర్శనల నడుమ ఊరేగింపుగా సారెను తీసుకెళ్లారు. అంతకుముందు శేషవస్త్రాలు, పసుపు కుంకుమ తదితర మంగళద్రవ్యాలతో కూడిన సారెను తిరుపతి ఎమ్మెల్యే ఎ. శ్రీనివాసులుకు అందజేశారు. బిఆర్ నాయుడు మాట్లాడుతూ గంగమ్మతల్లి సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వర స్వామి సోదరి అని, భక్తుల కోరికలు తీర్చే దైవంగా అమ్మవారు పూజలందుకుంటున్నారని తెలిపారు. టిటిడి నిధులతో తాతయ్య గుంట గంగమ్మ

ఆలయం అభివద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని, ఇదే సహకారాన్ని భవిష్యత్తులో అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు జి. భాను ప్రకాష్ రెడ్డి, శాంతా రామ్, డిప్యూటీ ఈవోలు వి.ఆర్.శాంతి, లోకనాథం, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనుంజయ, ఏవీఎస్వో సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఐదో రోజు గంగమ్మను 'దొర'వేషంలో భక్తులు దర్శించుకున్నారు. ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య ఆధ్వర్యంలో భక్తులకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీటిని పంపిణీ చేశారు. జాతర, విశ్వరూప దర్శనం రోజు భక్తులు ఎక్కువ సంఖ్యలో రానుండడంతో గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మంగళవారం జాతర రోజు, విశ్వరూప దర్శనం రోజు ఎవరెవరు ఎక్కడ ఉండాలి, ఎంతమంది స్టేజ్ పైన ఉండాలి, తదితర విషయాలపై ఉత్సవ కమిటీ, ఆలయ అధికారులు, పోలీసు అధికారులతో చర్చించామని అన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికష్ణ, డీఎస్పీ భక్తవత్సలం, సూపరింటెండెంట్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, ఆర్. ఓ. సేతుమాధవ్, ఆలయ ఈవో జయకుమార్ ఉన్నారు.

టిటిడి ఉద్యోగులకు హెల్మెట్ల పంపిణీ

ప్రజాశక్తి -తిరుమల

టీటీడీ ఉద్యోగులకు ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు శనివారం ఉదయం తిరుమలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ తిరుమల నుండి తిరుపతికి వచ్చే టీటీడీ ఉద్యోగులకు ప్రయాణ సమయంలో భద్రత కల్పించడంలో భాగంగా హెల్మెట్లు పంపిణీ చేయాలని నిర్ణయించామని అన్నారు. ఉద్యోగులకు హెల్మెట్లు పంపిణీ చేసేందుకు గుంటూరుకు చెందిన జలాది రఘురామ్, ఢిల్లీకి చెందిన కేసీఎన్ హెల్మెట్ల తయారీ సంస్థ అధినేత నవీన్ ముందుకు వచ్చారని తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతగా సుమారు రూ.5 లక్షలు విలువైన 555 హెల్మెట్లు విరాళంగా ఇచ్చారని చెప్పారు. 15 రోజుల్లో మరో 500 హెల్మెట్లు విరాళంగా ఇస్తారని చెప్పారు. వీటిని పరిశీలించి బాగున్నాయని తెలిపితే మరో ఐదు వేల హెల్మెట్లు అందిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతా రామ్, వీజీవోలు రామ్ కుమార్, సురేంద్ర పాల్గొన్నారు.

'వేదిక్ విద్యాన్'లో 'ఉయ్ లవ్ ఇండియా'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆపరేషన్ సింధూర్ సందర్భంగా తిరుపతిలోని వేదిక్ విద్యాన్ స్కూల్ ఛైర్మన్ మహేష్, కరస్పాండెంట్ పుష్పలత ఆధ్వర్యంలో 'ఉయ్ లవ్ ఇండియా వందేమాతరం' అనే స్లోగన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలందరూ వి లవ్ ఇండియా అంటూ నినాదాలు చేస్తూ, భారతదేశ ప్రధానమంత్రి మోడీకి ధన్యవాదాలు తెలుపుతూ, దేశభక్తిని చాటుకున్నారు.

సిపిఎం పోరాటాల స్ఫూర్తితో..

దిగ్విజయంగా రాష్ట్రకమిటీ సమావేశాలు / భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన

ప్రజాశక్తి-తిరుపతి సిటి

పాలకులు తమ నియంతృత్వ, మతతత్వ పోకడలతో ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలి, దేశ సంపదను దోచేస్తూ...ప్రజల వస్త్రధారణ ఎలా ఉండాలో నిర్ణయిస్తూ, ఆఖరికి ఆహారాన్ని సైతం తాము చెప్పిందే తినాలి అంటూ నయా ఫాసిస్ట్ ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఇలాంటి నియంతృత్వ మతతత్వ ధోరణిని నిలువరించేందుకు ప్రజలను చైతన్యవంతం చేసి, నియంతలా వ్యవహరించే పాలకులపై నిరంతర పోరాటాలు చేసేందుకు సంసిద్ధం చేసేలా సిపిఎం రాష్ట్ర కమిటి సమావేశాల్లో భవిష్యత్తు ప్రణాళికను రూపొందించింది. ఇందుకు తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రం వేదిక కావడం గమనార్హం. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు 'ఎర్రజెండా' స్ఫూర్తితో మూడు రోజుల పాటు రాష్ట్ర కమిటీ సమావేశాలు దిగ్విజయంగా జరిగేలా ఏర్పాట్లు చేశారు. తొలిరోజు ప్రదర్శన, బహిరంగసభ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో 'హైలెట్'గా నిలిచాయి. ఉగ్రవాదానికి 'మతం' రంగు పూయొద్దని వక్తలు ఉద్ఘాటించారు. ఎంఎ బేబి సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా తొలిసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతికి రావడం ఈ సమావేశాల విశేషం.

సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు మూడు రోజులు పాటు తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో 'ఎర్రజెండా' స్ఫూర్తితో నడిచాయి. రాష్ట్ర కమిటీలోని 60మందికి పైగా ప్రతినిధులు ఈ మూడు రోజుల పాటు నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి హాజరయ్యారు. మొదటి రోజు సాయంత్రం 5 గంటలకు తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి వందలాది మంది కార్యకర్తలు ఎర్రజెండాలు చేతబూని శ్రీనివాసం కాంప్లెక్స్, టిఎంసి సర్కిల్, తుడా రోడ్డు మీదుగా తుడా కార్యాలయంలో వెనుకనున్న కచ్చపి ఆడిటోరియం వరకూ సుమారు కిలోమీటరు పైగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కచ్చపి ఆడిటోరియంలో జరిగిన బారీ బహిరంగ సభలో ముఖ్యఅతిథి ఎంఎ బేబి మాట్లాడుతూ 80 ఏళ్ల క్రితం ప్రపంచ దేశాలను తమ గుప్పెట్లో ఉంచుకోవాలని, నియంతలా వ్యవహరించిన హిట్లర్‌ను నిలువరించేందుకు, ఫాసిజాన్ని అరికట్టేందుకు 'ఎర్రజెండా' మాత్రమే పోరాడిందన్నారు. సుమారు 2 కోట్ల 60 లక్షల మంది ఎర్రసైన్యం ప్రాణత్యాగంతో ప్రపంచ దేశాలకు స్వేచ్ఛను ప్రసాదించారని గుర్తు చేశారు. ప్రస్తుతం నయా ఫాసిజం విజృంభిస్తుందని, అత్యంత సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకున్న

ప్రజా'దృష్టి'

ఈ కాలంలో ప్రాణాలు అర్పించాల్సిన పనిలేదని, కుల, మత, ప్రాంత బేదాలు వీడి ఐక్యంగా పోరాడితే నయా ఫాసిజాన్ని అరికట్టవచ్చని పిలుపునిచ్చారు. త్వరలో జరగబోవు బీహార్ ఎన్నికల్లో పలు పార్టీలను ఐక్యం చేసి మతతత్వ పార్టీని ఎదుర్కొంటామని, రాబోవు రోజుల్లోనూ కలిసి వచ్చే పార్టీలను కలుపుకుని ప్రజలను ఐక్యం చేసి బిజెపి నియంతృత్వ ధోరణిని దీటుగా ఎదుర్కొని, తగిన బుద్ధి చెబుతామని వెల్లడించారు. రాష్ట్ర కమిటీ సమావేశాల్లో భవిష్యత్ పోరాటాలను రూపకల్పన చేశారు. 'పి4' పేదలను అవమానించే పథకంలా ఉందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి, ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు తప్పవని రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వాన్ని సిపిఎం హెచ్చరించింది.

నిరాడంబరత కమ్యూనిస్టులకే సాధ్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతిలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు తిరుపతి నగరంలో కార్యకర్తలతో కలిసి వాకింగ్‌కు వచ్చి రోడ్డుపైనే టీ తాగుతూ శనివారం తెల్లవారుజామున కనిపించారు. ఎల్లపుడూ సాధారణ జీవన విధానాన్ని అనుసరిస్తూ, ఆడంబరాలకు దూరంగా, ప్రజలతో మమేకమై జీవించడమే ఆయన వ్యక్తిత్వం. ఇది ఒక్క కమ్యూనిస్టులకే సాధ్యం.

శనివారం ఉదయం వాకింగ్‌లో జిల్లా నేతలతో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

రోడ్డా..? మురికినీటి గుంటా..?

ప్రజాశక్తి - బాలాయపల్లి : బాలాయపల్లి మండలం, పిగిలాం గ్రామంలో ఊరు నడిరోడ్డుపై మురికి నీరు నిలిచిపోయింది. ఎటు పోయే మార్గం లేక మురికిగుంటగా మారింది. దానికితోడు రోడ్డు ప్రక్కనే చెత్తాచెదారం, ఆ మురికి నీటిలోనే ఈగలు, దోమల దెబ్బకు రోడ్డు పరిసరాలు దుర్గంధంతో, అపరిశుభ్రంగా ఉంది. సమీప కాలనీ వాసులు రాత్రుళ్లు దోమలతో ఇబ్బంది పడుతున్నారు. విష జ్వరాలు సోకే అవకాశం ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. ఇక పాదచారులైతే ఆ మార్గంలో నడవాలంటే అడుగు పెట్టలేని పరిస్థితి. పరిస్థితి ఇలాఉన్నా పంచాయతీ అధికారులకు చీమ కుట్టినట్టు కూడాలేదు. కాలనీవసులు ఎన్నిసార్లు విన్నవించుకున్నా అధికారుల్లో స్పందన లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు రోడ్డుపై మురుగు నీరు పోయే మార్గం చేపాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రణాళిక ప్రకారం రుణాలు మంజూరు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : శనివారం బుచ్చినాయుడు కండ్రిగ మండలం, కనమనంబేడు గ్రామంలో జరిగిన మహిళా సంఘం సమావేశానికి ఏపియం మునెయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-2026 ఆర్థిక సంవత్సరంలో ఏయే సంఘాలకు ఋణాలు మంజూరు అవుతాయి, వాటితో ఎలాంటి జీవనోపాధి కార్యక్రమాలు చేపడతారు, వారికి ఏదైనా శిక్షణ అవసరమా అనే విషయాలపై చర్చించి వివరాలు సేకరించామని తెలిపారు. ఈ సమావేశంలో వెంకట రత్నం, జయంతి, మునిశేఖర్, సంఘ సభ్యులు పాలొన్నారు.

10 రోజులుగా అంధకారం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని పుత్తేరి గ్రామపంచాయతీకి చెందిన గిరిజన కాలనీలో 10 రోజులుగా విద్యుత్ సరఫరా లేదు. కాలనీవాసులు అంధకారంలో మగ్గుతున్నా విద్యుత్ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. ఒక విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేయమని విన్నవించుకున్నా ఫలితం లేదని కాలనీవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచ్ పంచాయతీ నిధులతో నిరుపయోగంగా ఉన్న ఒక విద్యుత్ స్తంభం తెప్పించి అవసరం అయిన చోట నటించారు. దీనికి కనెక్షన్ ఇవ్వమని అడగగా విద్యుత్ అధికారులు వచ్చి సగం పని చేసి మధ్యలో వెళ్లి పోయారు. దీంతో కరెంటు సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందోనని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం రోజువారీ వాడకానికి నీరు అందక, రత్రాయితే చీకట్లో జీవితం గడుపుతున్నామని వారు తెలిపారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏఈ, డీఈలను వివరణ అడుగగా సిబ్బంది అందుబాటులో లేరని తెలిపారు. త్వరలో సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

శ్రీకంటి రామ్మోహన్ రావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఓం శ్రీ వృద్ధ ఆశ్రమానికి ప్రముఖ సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహన్ రావు తన సొంత నిధులతో ఫ్రిడ్జ్‌ను వితరణగా ఇచ్చారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం నిర్వహించారు. గూడూరు, మాళవ్య నగర్ కూడలిలో దూర్వాసుల కామేశ్వర్ పుట్టిన రోజు సందర్భంగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా శ్రీ కంటి రామ్మోహన్ రావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బాలాజీ, కార్యదర్శి ఐ.పవన్ కుమార్, కోశాధికారి పవన్ కుమార్, ఉపాధ్యక్షులు జనార్ధన్ రావు, నారాయణ, జాయింట్ సెక్రటరి కాశీ విశ్వేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో నూతన గదులు ప్రారంభం

గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు, ఓం శ్రీ వృద్ధాశ్రమంలో నిర్మించిన నూతన గదులను ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ గదులను ఎమ్మెల్యే తన సొంత నిధులతో నిర్మించారు. అనంతరం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా ప్రగతి సేవా సంస్థ సభ్యుడినేనని ప్రగతి సేవా సంస్థ చేసే కార్యక్రమాలలో తన భాగస్వామ్యం ఉంటుందని తెలియజేశారు. అనంతరం ఎల్లసిరి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ కరోనా కాలం నుంచి ఇప్పటి దాకా ఎన్నో కార్యక్రమాలు చేయడంతో పాటుగా సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమం దత్తత తీసుకొని కావలసిన ఏర్పాట్లన్నీ చేస్తున్న ప్రగతి సేవ సంస్థ అధ్యక్షులు అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ ఆడిటర్ శ్రీ కంటి రామ్మోహన్ రావు, ప్రగతి సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే సబ్సిడీ రుణాలు

చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మహిళలు స్వయం ఉపాధి పొంది, తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నాయని నగరి గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. శనివారం వడమాలపేట మండలం, డ్వాక్రా సంఘాల సభ్యులు వడమాల దళిత వాడకు చెందిన కే.కావ్య, ఎనమల పాలెం దళిత వాడకు చెందిన సత్య, అప్పలాయగుంట దళిత వాడకు చెందిన గుణలకు ప్రధానమంత్రి అజయ్, ఉన్నతి పథకం క్రింద ఒక్కొక్కరికి రు.1,00,000/- చొప్పున మొత్తం రు.3 లక్షల రూపాయల చెక్కులు ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పంపిణీ చేశారు.

పెట్లూరు రోడ్డు గుంతల మయం

- వాహనదారులు, ప్రజలకు అవస్థలు
- అధికారులు, పాలకుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి- వెంకటగిరి టౌన్ : వెంకటగిరి మండలం, పెట్లూరు పంచాయతీకి చేరుకోవడానికి వెంకటగిరి టౌన్ నుండి మోడల్ స్కూల్ మీదుగా ఒక రోడ్డు, నాయుడుపేట వెళ్లే రోడ్డు నుండి ఆర్చి దగ్గర నుండి మరొక రోడ్డు ఉన్నాయి. ఈ రెండు రోడ్డులు కూడా గుంతల మయంగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాం నుండి ఇప్పటివరకు ఈ రోడ్ల దుస్థితి అలాగే ఉందని అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు ఆటోలలో గాని ద్విచక్ర వాహనాలలో గాని ప్రయాణాలు చేయాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టి, పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతులు వెంటనే చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ నాయకుల డిమాండ్

పెట్లూరు గ్రామానికి వెళ్ళు రెండు వైపులా రహదారుల మరమ్మతులు పూర్తి చేయాలని ద్విచక్ర వాహనదారులకు, ప్రయాణికు లకు, ఆటోలో ప్రయాణించు పాసింజర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రోడ్డు పనులు పూర్తి చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం పెట్లూరు గ్రామ కార్యదర్శి కె.రాజయ్య కెవిపిఎస్ నాయకులు టి.నారాయణలు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

రాజయ్య

సబ్సిడీతో పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి- ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని పశు వైద్య కేంద్రాల్లో ఏర్పేడు, పాపానాయుడుపేట రైతులకు శనివారం 50 శాతం సబ్సిడీతో పశువుల దాణా పంపిణీ జరిగినది. ఎస్సీ, ఎస్టీ, బిపిఎల్ రైతులకు దాణా అందించడం జరిగినదని పశు వైద్యాధికారులు డా. శిల్పారెడ్డి, డా. కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల ప్రజా ప్రతినిధులు పేరం ధనంజయుల నాయుడు, రెడ్డివారి గురవారెడ్డి, నైనారు పొన్నారావు, పేరం నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపల్ కార్మికులకు విధుల్లో ఎటువంటి సమస్యలు తలెత్తినా పరిష్కారం కోసం యూనియన్ అండగా ఉంటుందని ఈదులమూడి మధుబాబు పేర్కొన్నారు. పుత్తూరు, అంబేద్కర్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మునిసిపల్ ఇంజనీరింగ్-టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ పుత్తూరు పురపాలక సంఘ కమిటీ శనివారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదులమూడి మధుబాబు ఆధ్యక్షతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. పురపాలక సంఘ యూనియన్ కమిటీ అధ్యక్షుడిగా మల్లవరపు గణేష్‌ను, ప్రధాన కార్యదర్శిగా సింగరాజు మిధున్ చక్రవర్తిని, ఉపాధ్యక్షుడిగా మంగ సురేష్‌ను, కోశాధికారిగా కృష్ణ జయంతిని, కార్యనిర్వహణ కార్యదర్శిగా కే.గోపిని, సంయుక్త కార్యదర్శిగా చిన్న గోవిందప్ప మణికంఠన్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మధుబాబు మాట్లాడుతూ జనన మరణ రికార్డు రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికురాలైన కృష్ణ జయంతిని విధుల నుంచి తొలగించడం దారుణమని, వెంటనే ఆమెను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను కలిసి వినతి పత్రం అందిచనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎమ్మెల్యే బండారు

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తికి స్వామివారి చిత్రపటం ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి శనివారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు చేసుకున్నారు. అనంతరం స్వామీ, అమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలకగా, మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గాప్రసాద్ ముక్కంటి తీర్థ ప్రసాదాలను, జ్ఞాపికలను అందజేశారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, రావిళ్ళ వారి కండ్రిగ, ఎండి పుత్తూరు సచివాలయాల పరిధిలో ఉన్న అంగన్వాడీలలో శనివారం కిశోర్ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడీ సూపర్వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ బాలికలకు యుక్త వయసులో వచ్చే మార్పుల గురించి, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేయడం జరిగిందన్నారు. ప్రగతి సంస్థ సామాజిక కార్యకర్త సుమలత మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల జరిగే నష్టాలను వివరించామన్నారు. ఈ సమావేశంలో అంగన్వాడీ టీచర్లు అంకమ్మ, విమలాకుమారి, విజయ, కమలమ్మ, పద్మిని, ఆశా వర్కర్లు హెల్త్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎం ధనలక్ష్మి, ఎమ్మెస్ ఇంద్రాణి పాల్గొన్నారు.

శ్రీ విజయ దుర్గ అమ్మ వారికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, శ్రీ విజయ దుర్గ ఉపపీఠం, సాయి సత్సంగ నిలయంలో శ్రీ చక్ర ప్రతిష్ట 17వ వార్షికోత్సవం సందర్భంగా విజయదుర్గా అమ్మ వారికి విశేషాలంకరణ, కలశ స్థాపన, ప్రత్యేక పూజలు, శ్రీ మహా మృత్యుంజయ అమృత పాశుపత మహా రుద్రాభిషేక సహిత హోమం, శని త్రయోదశి సందర్భంగా స్వామివారికి తైలాభిషేకం నిర్వాహకులు కోటా సునీల్ కుమార్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

టీడీపీ నాయకులతో సమీక్ష

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గూడూరు మండలం నాయకులు, కార్యకర్తలతో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు మండలంలో సీసీ రోడ్లు లేని పంచాయతీలకు ఎస్టిమేషన్‌లు తీసుకువస్తే ఎం.ఎన్.ఆర్.జి.ఎస్ కింద నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. మండలంలో గ్రామ కమిటీలు, బూత్ కమిటీలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ ద్వారా మంజూరు అయిన ఎఫ్.డి.ఆర్ పనులను మండలంలోని సాగు నీటి సంఘం అధ్యక్షులు మాత్రమే చేయాలన్నారు.

కాలేషా, జయప్రకాష్‌లకు డాక్టరేట్స్

కోడూరు జయప్రకాష్

కుంపట్ల కాలేషా

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వాణిజ్య శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి కుంపట్ల కాలేషాకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు సిఈ బి.రాజమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో "పర్ఫామెన్స్ ఎవల్యూషన్ ఆఫ్ సెలెక్ట్ లిస్టెడ్ కంపెనీస్ ఆఫ్ ఎన్ఎస్ఈ ఎమర్జ్" అనే అంశం పైన పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. అలాగే తెలుగు విభాగ పరిశోధక విద్యార్థి కోడూరు జయప్రకాష్ డాక్టరేట్ ప్రధానం చేసినట్లు సిఈ రాజమాణిక్యం తెలిపారు. తెలుగు విభాగపు విశ్రాంతి ఆచార్యులు పేట శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో "రాయలసీమ రచయితల కథలు - పరిశీలన " అనే అంశంపై పరిశోధన గ్రంథన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు.

గంగమ్మకు బంగారు తిలకం బహూకరణ

గంగమ్మకు బంగారు తిలకం, సారె తీసుకెళుతున్న శ్రీ శక్తి పీఠం పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి శ్రీ శక్తి రమ్యానంద భారతీ స్వామి

ప్రజాశక్తి - రామచంద్రపురం: తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర సందర్భంగా రామచంద్రపురం మండలం రాయల చెరువు కట్ట సమీపాన ఉన్న శ్రీ శక్తి పీఠం పీఠాధీశ్వరి మంత్ర మహేశ్వరి శ్రీ శక్తి రమ్యానంద భారతీ స్వామి గంగమ్మకు వజ్రాలు పొదిగిన జాతి కెంపు బంగారు తిలకం, సారె సమర్పించారు. శనివారం ఉదయం శ్రీ శక్తి పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళా భక్తులతో గంగమ్మకు సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాయల చెరువు మాజీ సర్పంచ్ మాధవి రెడ్డి, శ్రీ శక్తి పీఠం సిబ్బంది, మహిళా భక్తులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలి

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద 2024-2025 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయంబర్స్ మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని గూడూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సుబ్బారామరాజు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ శుభ్రం..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 'నీరు ఇలా.. పోయేది ఎలా..?' అన్న వార్త రెండు రోజుల క్రితం ప్రజాశక్తిలో ప్రచురణ కాగా, మున్సిపల్ అధికారులు స్పందించి, శనివారం జేసీబీతో శుభ్రం చేయించారు. దుర్వాసన, దోమల బెడదనుండి స్థానిక ప్రజలు విముక్తి పొందారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తి యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈనెలా... కందిపప్పు లేనట్టే...

ప్రజాశక్తి - కేవిబి పురం: కెవిబి పురం మండల పరిధిలో పలు రేషన్ షాపుల్లో ఈ నెల కూడా కందిపప్పు ఇవ్వలేదు. దీనిపై లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో కొద్ది మందికి మాత్రమే పంపిణీ చేశారని విమర్శిస్తున్నారు. ప్రతి నెల కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే ఉచిత బియ్యం, పంచదార మాత్ర మే అందజేస్తున్నారు. బియ్యం, పంచదార మాత్రమే ఇచ్చి ప్రభు త్వం చేతులు దులుపుకుంటోందని కెవిబిపురం గ్రామస్తుడు నారాయణరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై కెవిబి పురం తహశీల్దారును వివరణ కోరగా జూన్, జూలై నెల నుంచి కందిపప్పు అందజేస్తామని తెలిపారు. గత కొన్ని నెలలుగా కంది పప్పు పైనుంచి విడుదల చేయకపోవడంతో ఇక్కడి లబ్ధిదారులకు ఇవ్వలేకపోయన్నారు. తొందర్లో కందిపప్పు, రాగులను ప్రభుత్వం అందజేయడానికి సన్నద్ధంగా ఉందని తెలిపారు.

టీటీడీకి దీపపు సమ్మెలు బహూకరణ

ప్రజాశక్తి - తిరమల: టీటీడీకి శనివారం రాత్రి నాలుగు వెండి దీపపు సమ్మెలు బహుమానంగా అందాయి. బెంగుళూరుకు చెందిన రాధా కృష్ణ, శ్యామ్ సుందర్ శర్మ, శశిధర్‌లు ఈ దీపపు సమ్మెలను బహూకరించారు. శ్రీవారి ఆలయ మహాద్వారం వద్ద పేష్కార్ రామకృష్ణకు దాతలు దీపపు సమ్మెలను అందజేశారు.

క్రైం న్యూస్

తాటి చెట్టుపై నుండి పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్ర గిరి): చంద్రగిరి, పాత పేట, రాయలకోటకు చెందిన బుద్దాల సిద్దయ్య రెండవ కుమారుడు బి.మోహన్ సాయి (26) శనివారం మధ్యాహ్నం తాటికాయల కోసం చెట్టు ఎక్కి పై నుండి జారి కింద పడ్డాడు. స్థానికులు గమనించి చంద్రగిరి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. బిటెక్ వరకు చదివి ఉద్యోగ అన్వేషణలో ఉన్న కుమారుడు చనిపోవడంతో తండ్రి సిద్దయ్య కన్నీరు మున్నీరయ్యాడు.

మహిళ అదృశ్యం

శ్యామలాదేవి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలోని పెద్ద సింగమాల గ్రామానికి చెందిన మహిళ అదృశ్యంపై శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాగార్జున రెడ్డి తెలిపారు. పెద్ద సింగమాలకు చెందిన శ్యామలాదేవి (69) గత రెండు రోజులుగా కనిపించడం లేదని బంధువులు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసినవారు సెల్: 9440900008 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా కోరారు.

పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయండి

ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు వినతి చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: నారాయణ వరం మండలం, కైలాసనాథ కోనలో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ విష్ణువర్ధన్ రాజును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. శనివారం సాయంత్రం తిరుపతిలోని ఎస్పీ కార్యాలయానికి చేరుకొని ఈ మేరకు ఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. కైలాసనాథ కోనకు తమిళనాడు నుండి కూడా పర్యాటకులు వస్తుంటారన్నారు. కొంతమంది యువకులు మద్యం సేవించి తరచూ అలజడి సృష్టిస్తున్నారంటూ ఫిర్యాదులు అందుతున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. మహిళా పర్యాటకులకు భద్రత కల్పించడంలో భాగంగా పోలీసు ఔట్ పోస్ట్ తప్పనిసరి అవసరం ఏర్పడిందని ఎస్పీకి ఎమ్మెల్యే వివరించారు. తన విజ్ఞప్తులకు ఎస్పీ హర్షవర్ధన్ రాజు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

హెడ్మాస్టర్లుగా సెకండరీ గ్రేడ్ టీచర్లను నియమించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలల (మోడల్ ప్రైమరీ స్కూల్స్) హెడ్మాస్టర్లుగా సీనియారిటీ మేరకు పదోన్నతి పై సెకండరీ గ్రేడ్ టీచర్లను నియమించాలని ఎస్ టి యు రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక బైరాగి పట్టడ లోని ఎస్టియు భవన్‌లో శనివారం జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు అధ్యక్షతన ఆ సంఘ ముఖ్య ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్టియు రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా సెకండరీ గ్రేడ్ టీచర్లను పదోన్నతి ద్వారా నియమించాలని డిమాండ్ చేశారు. గతంలో ఎల్.ఎఫ్.ఎల్, పి.ఎస్ హెచ్.ఎం.లుగా సెకండరిగ్రేడ్ టీచర్లు మాత్రమే నియమించారన్నారు. 600కు పైగా విద్యార్థులున్న ఉన్నత పాఠశాలలలో ప్రతి సబ్జెక్టుకు అదనంగా స్కూల్ అసిస్టెంట్స్‌లను నియమించాలన్నారు. తెలుగు, ఇంగ్లీష్ సబ్జెక్టులకు అదనంగా టీచర్లను నియమించాలన్నారు. ఆదర్శ పాఠశాలలకు విలీనం అవుతున్న ఇతర పాఠశాలల్లో ఇప్పటికే పనిచేస్తున్న ఉపాధ్యాయుల విల్లింగ్‌తో అదే పాఠశాలలో నియమించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.జగన్నాథం మాట్లాడుతూ మెడికల్ సర్టిఫికెట్ల జారీలో గతంలో మెడికల్ బోర్డు జారీ చేసిన సర్టిఫికెట్లను పరిగణలోకి తీసుకోకుండా డాక్టర్లు నిర్లక్ష్యం ప్రదర్శించారన్నారు. పెండింగ్‌లోనున్న పిఎఫ్, ఏపి.జి.ఎల్.ఐ., రిటైర్మెంట్ తుది చెల్లింపులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లికి మాత్రమే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టం మేరకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల అసంబద్ధ ప్రచారాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. డీఎస్సీ నిర్వహిస్తున్నందున ఖాళీగా ఉన్న అన్ని వేకెన్సీలను బదిలీలు, పదోన్నతులకు చూపించాలని అన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ రామాంజనేయులు మాట్లాడుతూ జూన్ 5 నుండి తలపెట్టిన ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాలను ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మండల కేంద్రాల్లో నిర్వహించాలని, వేసవి తీవ్రత దృష్ట్యా ఆన్లైన్‌లో శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీ.వాసు, మంచినీళ్ల వెంకటరమణ, మురళీకృష్ణ, శ్రీనివాసులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి ప్రేమ చాలా గొప్పది

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పకృతిలో తల్లి ప్రేమ చాలా గొప్పదని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి ప్రమీల పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మే నెలలో రెండో ఆదివారం రోజున మాతృ దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారన్నారు. శనివారం పుత్తూరు మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కామరాజు నగర్, రజక కాలనీ, గేట్ పుత్తూరు అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహించిన కార్యక్రమంలో సిడిపిఓ ప్రమీల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. తల్లి ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం ప్రతి తల్లికి బిడ్డ పాదపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రీస్కూల్ పిల్లలు వారి తల్లులు, అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్ గీతాంజలి పాల్గొన్నారు. వడమాలపేట మండలం, ఎస్‌బిఆర్ పురం పంచాయతీ, అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లికి వందనం కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ వై.రోజా రమణి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె తల్లి ప్రాముఖ్యతను వివరిస్తూ పిల్లలతో తల్లులకు పాదపూజ చేయించారు. అనంతరం చిన్నారులకు పోటీలు పెట్టి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ మునిరత్నమ్మ, అంగన్వాడి సిబ్బంది జయలక్ష్మి, సుజాతమ్మ, లక్ష్మి దేవి, విమల, ప్రమీల, విజయలక్ష్మి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

భారత ఆర్మీకి చిన్నారుల ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): భారత్, పాక్‌ల యుద్ధ నేపథ్యంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఇష్టం లేక తిరుపతిలోని ఓ కుటుంబానికి చెందిన అనిరుద్ శ్రీరామ్, సుచిత్ర శ్రీ అనన్య, ఆశ్రిత్ శ్రీరామ్ ముగ్గురు చిన్నారులు తమ పుట్టినరోజుకు అయ్యే ఖర్చును భారత ఆర్మీకి ఇవ్వాలని తలంచారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి సమక్షంలో 60 వేల రూపాయల నగదును భాను ప్రకాష్ రెడ్డికి ఇవ్వగా, డిడి రూపంలో భారత ఆర్మీకి పంపేలా చర్యలు తీసుకుంటామని భానుప్రకాష్ రెడ్డి తెలిపారు.

నాటుసారాని నిర్మూలించాలి

ప్రజాశక్తి -ఏర్పేడు : అసిస్టెంట్ కమిషనర్ ఎక్సైజ్ చిత్తూరు వారి ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వారి సిబ్బంది ఏర్పేడు మండలం బత్తినయ్య కాలనీలో రాష్ట్ర ప్రభుత్వము చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు నాటు సారాయి దుష్ప్రభావాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాసుదేవ చౌదరి అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతి, లావణ్య ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇనస్పెక్టర్ శ్రీకాళహస్తి, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాళహస్తి, సిబ్బంది పాల్గొన్నారు.